

సోమశిలలో 36.038 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 36.038 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 93.196 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,760
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,546
3శాతం జీఎస్టీతో	రూ.5,712
నవర (8గ్రా)	రూ.45,696

గరిష్టం/కనిష్టం 41.8 /31.5

వాతావరణం

సోమవారం గాలిలో 34 శాతం తేమ ఉంది. మంగళవారం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతలతోపాటు వేడి గాలులు వీస్తాయని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

కామాక్షితాయి సేవలో..



జస్టిస్ శివశంకరరావుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జ్యుడీషియల్ ప్రివ్యూ చైర్మన్ డాక్టర్ జస్టిస్ బి.శివశంకరరావు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తొలుత గణపతిస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆయనను సత్కరించి తీర్థప్రసాదాలను అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు, అర్చకులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి

వెంకటాచలం: విద్యార్థులు విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో సోమవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రిజిస్ట్రార్ మాట్లాడుతూ చదువులో రాణించడంతోపాటు ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యతను సాధించడం చాలా అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి విజయ వినీల్‌కుమార్ స్కిల్ హబ్, స్కిల్ కాలేజీల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వీఎస్‌యూ నైపుణ్యాభివృద్ధి సమన్వయకర్త డాక్టర్ జె.విజేత పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 9 మంది డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో డిగ్రీ ఐదో, రెండో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభం కాగా, మొత్తం తొమ్మిది మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. ఉదయం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 4,578 మంది విద్యార్థులకు గాను 4,233 మంది హాజరయ్యారు. 345 మంది గైర్హాజరయ్యారు. కాగా విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 10,228 మంది విద్యార్థులు హాజరుకావాల్సిఉండగా 9,496 మంది హాజరయ్యారు. 732 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 5 మంది, నెల్లూరులోని జగన్స్ డిగ్రీ కళాశాల, శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల, కోవూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కో విద్యార్థి చొప్పున డిబార్ అయినట్లు తెలిపారు.

ట్రైయినీ కలెక్టర్ రక్తదానం



నెల్లూరు(అర్బన్): నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయాన్ని ట్రైయినీ కలెక్టర్ విద్యాధరి సోమవారం సందర్శించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న బ్లడ్‌బ్యాంకు, మానసిక దివ్యాంగుల కేంద్రం, తలసేమియా సెంటర్ సేవలను పరిశీలించి కొనియాడారు. అనంతరం ఆమె స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆమె వెంట రెడ్‌క్రాస్ కార్యదర్శి మస్తానయ్య, తలసేమియా సెంటర్ కన్వీనర్ సీత, స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథరావు తదితరులు ఉన్నారు.

క్లిక్.. అమౌంట్.. ఓకే



➡ నెల్లూరు నగరం రామలింగాపురంలోని నాగేశ్వరరావు ఇంటికి ఇటీవల ఓ మధ్యాహ్న సమయంలో అనుకోకుండా బంధువులు వచ్చారు. వారికి భోజనం పెట్టాలి. సమయానికి తగినన్ని కూరగాయలు కూడా లేవు. ఏం చేయాలో ఆ ఇల్లాలికి పాలుపోలేదు. భర్తతో అదే విషయం చెప్పింది. వెంటనే ఆమెను కంగారు పడొద్దని చెప్పి జొమాటోలో చికెన్ బిర్యానీ ఆర్డర్ చేశారు. 15 నిమిషాల్లో డెలివరీ బాయ్ వచ్చి ఘుమఘుమలాడే బిర్యానీ అందజేశాడు.

➡ కావలికి చెందిన అనసూయమ్మ కొత్తగా ఇల్లు నిర్మించుకుంది. బాగా ఖర్చు చేసి గోడలకు పెయింట్ వేయించుకున్నా ఆమెకు అంతగా నచ్చలేదు. స్నేహితురాళ్ల సూచనతో ఆన్‌లైన్ పోర్టల్ అమెజాన్‌లో తనకు నచ్చిన కలర్స్, డిజైన్స్ ఎంపిక చేసుకుని వాల్‌పేపర్లు ఆర్డర్ చేసింది. రెండు రోజుల్లో పార్సిల్ డెలివరీ వచ్చింది. వాటిని పనివాళ్లతో గోడలకు అంటించుకోవడంతో రిచ్ లుక్ వచ్చింది.

అంతా ఆన్‌లైన్ లావాదేవీలు

- జిల్లా జనాభా 32 లక్షలు
- స్మార్ట్ ఫోన్ యూజర్లు సుమారు 6 లక్షలు
- డిజిటల్ లావాదేవీలు 55 శాతం
- తక్కువ సమయంలోనే నగదు బదిలీలు
- పారదర్శకతతోపాటు అకౌంటబులిటీ

ఇలా ఒకరిద్దరే కాదు.. స్మార్ట్ ఫోన్ వాడుతున్న చాలా మంది ఉన్న చోటు నుంచి కదలకుండా తమకు కావాల్సిన వస్తువులను డిజిటల్ యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి తెప్పించుకుంటున్నారు. స్మార్ట్ ఫోన్‌లో డేటా బ్యాలెన్స్ ఉండి.. బ్యాంక్ అకౌంట్‌లో డబ్బు ఉంటే చాలు ఎక్కడికి వెళ్లినా కావాల్సినవి కొనుగోలు చేయొచ్చు. యూనిక్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ యాక్సెస్ ఉన్న గూగుల్ పే, పేటీఎం, ఫోన్‌పే తదితర వాటి ద్వారా చెల్లింపులు భారీగా జరుగుతున్నాయి. చాలామంది ఇంట్లో నుంచే బస్సు, రైలు, విమాన టికెట్లు బుక్ చేసుకుంటున్నారు. నేరుగా కరెన్సీ నోట్ల ద్వారా క్రయవిక్రయాలు బాగా తగ్గిపోతున్నాయి. ఇది ఒక రకంగా మంచి పరిణామమే. కానీ ఆన్‌లైన్ చెల్లింపులు చేసే సమయంలో మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. 'మీకు గిఫ్ట్‌లు వస్తాయి.. నగదు బ్యాంక్ అకౌంట్లో పడుతుంది.' అంటూ గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింక్‌లు ఓపెన్ చేయకూడదు.

పెరుగుతున్న డిజిటల్ ప్రాధాన్యత

ఆన్‌లైన్ లావాదేవీలు అంటే కంప్యూటర్ లేదా మొబైల్ ద్వారా జరిగే నగదు బదిలీలు. ఇలా చేయడం వల్ల అకౌంటబులిటీ ఉంటుంది. ఎవరి ఖాతా నుంచి ఎవరి ఖాతాకు ఎంత మేరకు నగదు బదిలీ అవుతోందో స్పష్టమవుతుంది. అంతా పారదర్శకంగా ఉంటుంది. దేశంలో మూడేళ్లుగా ఆర్థిక లావాదేవీల్లో అధిక శాతం డిజిటల్ రూపంలోనే సాగుతున్నాయి. తొలుత పట్టణాలకే పరిమితమైన 'ఈ' లావాదేవీలు గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా ఇంటింటికీ వెళ్లి కాయగూరలు అమ్మే మహిళలు సైతం డిజిటల్ లావాదేవీలకు అలవాటు పడ్డారంటే పరిస్థితి అర్థమవుతోంది. యూఐడీఏఐ (యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) లెక్కల ప్రకారం నెల్లూరు జిల్లా జనాభా సుమారు 32 లక్షలు. వీరిలో దాదాపు 14 లక్షల మంది మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నట్లు అంచనా. ఇందులో దాదాపు 43 శాతం అంటే ఇంచుమించు 6 లక్షల మంది వరకు స్మార్ట్ ఫోన్లు కలిగి ఉన్నారు. వీరంతా ఆన్‌లైన్ ద్వారానే ఆర్థిక లావాదేవీలు చేస్తున్నారని బ్యాంకింగ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కరోనా తర్వాత ఈ తరహా లావాదేవీలు ఎక్కువయ్యాయి. బ్యాంకుకు వెళ్లి గంటల తరబడి సమయం వెచ్చించి నగదు విత్‌డ్రా చేయడం ప్రస్తుతం బాగా తగ్గిపోయింది. ఇంటి నుంచే కంప్యూటర్ లేదా మొబైల్ ద్వారా నిమిషాల్లోనే నగదు బదిలీలు జరుగుతున్నాయి. ఈ డిజిటల్ లావాదేవీలు ప్రస్తుతం 55 శాతం వరకు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది.

స్విగ్గీ, జొమాటోల ఆధిపత్యం

జిల్లాలో ఆహారం సరఫరా చేసే ఆన్‌లైన్ యాప్‌లలో స్విగ్గీ, జొమాటోలు మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. హెచ్‌ఎస్‌బీసీ గ్లోబల్ రీసెర్చ్ నివేదిక ప్రకారం 2022 సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల్లో 55 శాతం వాటాను జొమాటో కలిగి ఉంది. 40 శాతం వాటా స్విగ్గీ సొంతం. మిగిలిన 5 శాతం వాటా ఇతర యాప్‌లదే. ఇవి వినియోగదారులకు నేరుగా ఆహారాన్ని అందించి రెస్టారెంట్ల నుంచి భారీగానే కమీషన్లు తీసుకుంటున్నాయి. ఈ సొమ్ముతోనే స్టాఫ్ జీతాలు, ఆఫీసుల నిర్వహణకు ఖర్చు చేస్తుంటాయి.

ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్

దుకాణానికి వెళ్లి వస్తువు కొని నగదు ఇవ్వడం.. చిల్లర కోసం ఎదురు చూడడం.. డబ్బు సరిపోకపోతే మళ్లీ ఇంటికి రావడం .. ఆ రోజులు ఇప్పుడు దాదాపుగా లేవు. ఒక్క క్లిక్‌తో మనీ ట్రాన్స్‌ఫర్ చేసి ఆహారం తినొచ్చు. టీ తాగొచ్చు. నచ్చిన వస్తువు కొనుక్కోవచ్చు. అవును కాలం ఎంతో వేగంగా మారిపోయింది. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా.. బ్యాంక్ అకౌంట్‌లో నగదు ఉంటే చాలు. స్మార్ట్ ఫోన్‌లోని ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా సులువుగా లావాదేవీలు చేసేయొచ్చు.

ఏ వస్తువు కావాలన్నా..



ప్రస్తుతం నేరుగా వెళ్లి షాపింగ్ చేసేవాళ్లు తగ్గిపోతున్నారు. ఒకప్పుడు ఏ వస్తువు కావాలన్నా మూడు, నాలుగు దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేసేవారు. నేడు ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. వస్తువులను ఒకటికి నాలుగు ఈ-కామర్స్ యాప్‌లలో చూసి.. రేట్లను బేరీజు వేసుకుని రేటింగ్స్ చూసి కొంటున్నారు. నిత్యావసర వస్తువులు, కూరగాయలు కూడా ఆర్డర్ పెట్టగానే గంటల్లోనే ఇంటికి చేరుస్తున్నారు. దీంతో దుకాణాల్లో వ్యాపారం గతంతో పోల్చుకుంటే బాగా తగ్గింది. దుస్తులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేవారు అధికమయ్యారు. ఆయా ఈ-కామర్స్ సంస్థలు వినియోగదారులను ఆకర్షించేందుకు ఆఫర్స్ ఇస్తూ పోటీ పడుతున్నాయి.

గ్రామాల్లోనూ డిజిటల్ లావాదేవీలు



గ్రామాల్లోనూ హోటళ్లు, తోపుడుబండ్ల వారు ఇటీవల డిజిటల్ లావాదేవీలు చేస్తున్నారు. ఒకప్పుడు నగదునే ఇవ్వాలని కోరే చిరు వ్యాపారులు ఇప్పుడు ఫోన్ పే, గూగుల్ పేకు అలవాటు పడ్డారు. దీని వల్ల అకౌంటబులిటీ ఏర్పడుతుంది.

– నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ఆత్మకూరు

నగదు రహిత లావాదేవీలు బాగున్నాయి



మా దగ్గరకు వచ్చే కొనుగోలుదారులు నగదు రహిత లావాదేవీలు చేస్తున్నారు. అకౌంట్‌కు నగదును మార్చడం, ఫోన్ ద్వారా బిల్లులు చెల్లించడం జరుగుతోంది. డిజిటల్ పేమెంట్ల వ్యవస్థ బాగుంది.

– చిన్ని సుధీర్, చిల్లర వ్యాపార సంఘం కార్యదర్శి, ఆత్మకూరు

ఆదివారం నాడు ప్రజలు ఆన్‌లైన్‌లో ఆహార పదార్థాలను ఆర్డర్ ఇవ్వడం ఈ మధ్య కాలంలో బాగా ఎక్కువైంది. వాటిలో ముఖ్యంగా బిర్యానీ కోసం ఆర్డర్లు ఎక్కువగా ఉంటున్నాయని ఓ ప్రముఖ సంస్థ డెలివరీ బాయ్ తెలిపారు.

పక్కాగా లెక్కలు

ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లో లెక్కలు పక్కాగా ఉంటాయి. చిన్న చిన్న షాపుల్లో సైతం క్యూఆర్ కోడ్‌తో ట్రాన్సాక్షన్‌లు జరుగుతున్నాయి. రోజు వారీ ఖర్చులతోపాటు కరెంట్, పేపర్ బిల్లు వంటివి పేద, మధ్య తరగతి ప్రజలు సైతం ఫోన్ ద్వారానే చెల్లిస్తున్నారు. ఇంట్లో నుంచి బయటకు వచ్చే సమయంలో డబ్బులు జేబులో ఉన్నాయా లేదా అని చూసుకోవాల్సిన అవసరం లేదు. స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు. ప్రస్తుతం జిల్లాలో 55 శాతం వరకు అన్ని చెల్లింపులు ఆన్‌లైన్ యాప్‌ల ద్వారానే జరుగుతున్నాయని తెలుస్తోంది.

– సాక్షి, నెల్లూరు డెస్క్

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం



'జగనన్న విద్యాకానుక' పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



విద్యార్థినికి విద్యాకానుక కిట్ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: మానవ వనరుల అభివృద్ధి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఈదూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన 'జగనన్న విద్యాకానుక' పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్‌తో కలిసి మంత్రి కాకాణి పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యావ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్కరణలు తెచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలో 1,92,743 మంది విద్యార్థులకు రూ.38.55 కోట్లతో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇది కేవలం ఖర్చు మాత్రమే కాదని, భావితరాల భవిష్యత్తుకు పెట్టుబడి నిధిగా భావించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఇప్పటికే ట్యాబ్‌లను అందించడంతోపాటు టోఫెల్ ప్రీ క్వాలిఫికేషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ విద్య జీవితంలో మార్పునకు నాంది అని తెలిపారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఎంఈఓ వేణుగోపాలరెడ్డి, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, సొసైటీ అధ్యక్షుడు కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, మన్నె సుబ్రహ్మణ్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడి ప్రారంభం రోజునే విద్యాకానుక



గతంలో మా అమ్మా నాన్న పుస్తకాలు, బ్యాగులు ఎప్పుడు తీసిస్తారా అని ఎదురు చూసేదాన్ని. ఇప్పుడు మా బడి ప్రారంభం రోజునే మాకు విద్యాకానుక కిట్లు అందుతున్నాయి. ఇందులో నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, మూడు జతల యూనిఫాం, బెల్టు, టై, బూట్లు, సాక్సులు, డిక్షనరీ అన్నీ ఉన్నాయి. జగనన్న విద్యాకానుకను అందించిన సీఎం సర్‌కు చాలా థాంక్స్.

– శ్రీనిధి, పదో తరగతి, జెడ్పీ ఉన్నత పాఠశాల, ఈదూరు

జగన్ మామయ్యకు ధన్యవాదాలు



మా నాన్న ట్రాక్టర్ డ్రైవర్. నాకు పుస్తకాలు, బ్యాగులు కొనిచ్చే స్థోమత ఉండేది కాదు. నా ఏడో తరగతి నుంచే మా స్కూల్లోనే నాకు పుస్తకాలు, బ్యాగులు, ఇతర సామగ్రి ఉచితంగా అందిస్తున్నారు. దీంతో మా నాన్నకు ఇబ్బంది లేకుండాపోయింది. మా కోసం ఇంత చేస్తున్న జగన్ మామయ్యకు ధన్యవాదాలు.

– కొంగర శివతేజ, పదో తరగతి, జెడ్పీ ఉన్నత పాఠశాల, మదమనూరు

ఆనం 'హైలెవల్'.. పనులు 'లోలెవల్'

గతంలో సోమశిల హైలెవల్ కెనాల్ పనుల పేరుతో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు మెట్ట రైతులకు ఆశలు కల్పించి పనులను పూర్తి చేయలేకపోయాయి. ఈ పనులను చేయించడంలో అప్పటి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విఫలమయ్యారు. టీడీపీ ప్రభుత్వంలో హైలెవల్ కెనాల్ డిజైన్లను పట్టించుకోకుండా అప్పటి తెలుగుదేశం నేతలు తమకు ఇష్టమున్న చోట్ల పనులు చేపట్టి నిధుల మేతకే ప్రాధాన్యం ఇచ్చారు. లక్ష్యం నెరవేర్చేందుకు కృషి చేసిన దాఖలాలు ఎక్కడా కన్పించలేదు.

- మెట్ట రైతుల ఆశలపై ఆనం, టీడీపీ తూట్లు
- అస్తవ్యస్తంగా హైలెవల్ కెనాల్ పనులు
- రైతులను నమ్మించి మోసం చేసిన వైనం
- సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో రెండో దశ పనులకు శ్రీకారం



టీడీపీ హయాంలో పొంగూరుకండ్రిక వద్ద చేపట్టిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనుల వద్ద అడవిని తలపిస్తున్న ప్రాంతం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): అంతా తామే అన్నట్టుగా ఆనం సంజీవరెడ్డి సోమశిల హైలెవల్ కెనాల్ పనులకు 2013 ఏప్రిల్ 1న అప్పటి రాష్ట్ర ఆర్థికమంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి, అప్పటి కాంగ్రెస్ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ఈ పనులు నిధుల మేతకే తప్ప ఆచరణలో అంగుళం కూడా ముందుకు జరగకపోవడంతో ఇందుకు కారణమైన పాలకులపై మెట్టప్రాంత రైతులు పదేళ్లుగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీలో ఆత్మకూరు నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా పనిచేసిన ఆనం రామనారాయణరెడ్డి హైలెవల్ కెనాల్ పనులు చేయించడంలో విఫలమయ్యారని రైతులు పేర్కొంటున్నారు. రూ.840.92 కోట్లతో తొలి దశ సోమశిల హైలెవల్ కెనాల్ పనులను 2014 నవంబర్ 7వ తేదీన ప్రారంభించారు. అయితే ఇందులో హైలెవల్ కెనాల్ డిజైన్లను పట్టించుకోకుండా అప్పటి టీడీపీ నేతలు తమకు ఇష్టమున్న చోట పనులు చేపట్టి నిధుల మేతకే ప్రాధాన్యం ఇచ్చారు. మొత్తమ్మీద రూ.532.62 కోట్ల మేర పనులు చేశామని లెక్కలు చూపి బిల్లులు చేసుకున్నారు.

వాస్తవం ఏంటంటే..

హైలెవల్ కెనాల్ డిజైన్ ప్రకారం మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి వద్ద ఒక టీఎంసీ సామర్థ్యంతో మినీ రిజర్వాయర్, పొంగూరు వద్ద 0.230 టీఎంసీ సామర్థ్యంతో రెండో రిజర్వాయర్, ఇసుకపల్లి వద్ద 0.330 టీఎంసీ సామర్థ్యంతో మూడో రిజర్వాయర్, పెగళ్లపాడు వద్ద ఒక టీఎంసీ సామర్థ్యంతో 4వ రిజర్వాయర్, కంపసముద్రం వద్ద 1.37 టీఎంసీల సామర్థ్యంతో 5వ రిజర్వాయర్, చాబోలు వద్ద 0.25 టీఎంసీ సామర్థ్యంతో 6వ రిజర్వాయర్, వింజమూరు మండలం గుండెమడగల వద్ద 0.60 టీఎంసీల సామర్థ్యంతో 7వ రిజర్వాయర్ నిర్మించి మర్రిపాడు, ఆత్మకూరు, దుత్తలూరు, వింజమూరు మండలాల్లోని 88,503 ఎకరాలకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తామని అప్పటి కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాల్లో చక్రం తిప్పిన ఆనం రామనారాయణరెడ్డి అనేక బహిరంగ సభల్లో చెప్పారు. అయితే ఈ పనుల కోసం అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబు వద్దకు వెళ్లి నిధులు తెచ్చి వినియోగించిన దాఖలాలు లేవు.

రైతులను నమ్మించి..

రిజర్వాయర్లు, పంపుహౌస్‌లు, పైపులైన్ల నిర్మాణాలను గ్రావిటీ ఆధారంగా నిర్మించాల్సిఉంది. అలాగే తొలి రిజర్వాయర్ నిర్మించాల్సిన పడమటినాయుడుపల్లిలో కనీసం భూసేకరణ చేపట్టకుండానే పొంగూరు, ఇసుకపల్లి వద్ద రిజర్వాయర్ల పనులకు అప్పటికి మంజూరై ఉన్న నిధులను వినియోగించేలా ప్రత్యేక కార్యాచరణతో పనిచేశారు. హైలెవల్ కెనాల్ నిర్మాణంలో భాగంగా మొత్తం 7 రిజర్వాయర్ల కోసం అంచనాలు తయారు చేస్తే వాటిలో తొలి రిజర్వాయర్లు అయిన పడమటినాయుడుపల్లి, పొంగూరు, ఇసుకపల్లి రిజర్వాయర్లు మాత్రమే ఫేజ్-1లో చేపడతామని పేర్కొన్నారు. ఈ నిర్మాణాల ద్వారా 43,200 ఎకరాలు సాగులోకి వస్తాయని రైతులను నమ్మించారు. అంతా గమనిస్తే ఏ ఒక్కచోటా సగం పనులు కూడా చేసిన దాఖలాలు లేవు.

నిలిచిన భూసేకరణ

మొత్తం రిజర్వాయర్ల నిర్మాణానికి 5340.27 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, 3465.92 ఎకరాలను సేకరించారు. పడమటినాయుడుపల్లితో సహా మిగిలిన చోట్ల రిజర్వాయర్లు నిర్మించే ప్రదేశాల్లో మరో 1874.33 ఎకరాల భూసేకరణ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. గ్రావిటీ కాలువలు 33.175 కిలోమీటర్లు నిర్మించాల్సి ఉండగా, ఈ పనులను హైలెవల్ కెనాల్ ప్రారంభం నుంచి కాకుండా తమకు ఆదాయం వచ్చే చోట మొదలుపెట్టి 20.985 కిలోమీటర్లు పూర్తయినట్లు లెక్కలు చూపి బిల్లులు చేసుకున్నారు. ఆ తరువాత పూర్తి చేయాల్సిన 12.190 కిలోమీటర్లు పట్టించుకోకుండా వదిలేశారు. అలాగే హైలెవల్ కాలువ నిర్మాణంలో భాగంగా అనంతసాగరం మండలం సోమశిల, ఎగువపల్లి, చాపురాళ్లపల్లి, మర్రిపాడు మండలం భీమవరం, ఇసుకపల్లి వద్ద మాత్రం కొంత నిర్మాణాలు పూర్తి చేసి మమ అనిపించారు. ఇలా తొలి దశ హైలెవల్ కెనాల్ పనులను నిధుల మేతకే తప్ప రైతుల ప్రయోజనాలతో పనిలేకుండా గందరగోళం చేసి తూట్లు పొడిచారు.

రెండో దశ పనులకు వైఎస్ జగన్ శ్రీకారం

మెట్టప్రాంత రైతులకు దశాబ్దాల కలగా ఉన్న హైలెవల్ కాలువ నిర్మాణ పనులకు సంబంధించిన సమస్యలను మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో 2020 నవంబర్ 9న రూ.648.98 కోట్ల అంచనా వ్యయంతో ముఖ్యమంత్రి చేతుల మీదుగా మర్రిపాడు మండలం కృష్ణాపురం వద్ద 2వ దశ హైలెవల్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా కంపసముద్రం వద్ద 20,218 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే 1.37 టీఎంసీల సామర్థ్యం గల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు శరవేగంగా చేస్తున్నారు. ప్రస్తుతం చేపడుతున్న పనులతో మర్రిపాడు మండలంలోని 10,103 ఎకరాలకు, ఉదయగిరి మండలంలో 9,800 ఎకరాలకు, వింజమూరు మండలంలో 10,550 ఎకరాలకు, దుత్తలూరు మండలంలో 16,000 ఎకరాలకు సాగునీరు అందించేలా అధికార యంత్రాంగం పనులు నిర్వహిస్తున్నారు.

హైలెవల్ కెనాల్ పనులను పట్టించుకోలేదు



హైలెవల్ కెనాల్ పనులకు సోమశిలలో అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా అప్పటి రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. అనంతరం రెండేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఐదేళ్లు పాలించిన తెలుగుదేశం ప్రభుత్వాలు హైలెవల్ కెనాల్ పనుల గురించి పట్టించుకోలేదు. మాజీ ఎంపీ మేకపాటి, దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి రైతుల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రెండో దశ పనులకు 2020లో శంకుస్థాపన చేసి ముమ్మరంగా చేస్తున్నారు.

– కుటుముందు లక్ష్మీరెడ్డి, మాజీ సర్పంచ్, బూదవాడ, మర్రిపాడు మండలం



ఉత్సాహంగా బడికి..

- పాఠశాలలు పునః ప్రారంభం
- తొలిరోజు 93,222 మంది విద్యార్థుల హాజరు
- విద్యా కానుక కిట్ల అందజేత



నెల్లూరు కేఎన్నార్ స్కూల్లో అడ్మిషన్ల కోసం వచ్చిన తల్లిదండ్రులు, పిల్లలు



పాఠశాలకు వెళ్తున్న విద్యార్థిని

నెల్లూరు(టౌన్): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు సోమవారం పునః ప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థులు ఉత్సాహంగా బడులకు వచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్నం వరకు తరగతులు నిర్వహించారు. అడ్మిషన్ల కోసం స్కూళ్లకు తల్లిదండ్రులు, పిల్లలు పోటెత్తారు. నెల్లూరు భక్తవత్సల నగర్‌లోని కేఎన్నార్ మున్సిపల్ స్కూల్లో ప్రవేశపరీక్ష పెట్టారు. అక్కడ సీట్లు లేవని, ఆరో తరగతిలో మాత్రమే ఉన్నట్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. జిల్లాలో 2,637 ప్రభుత్వ, 812 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. మొదటిరోజు 93,222 మంది హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ఉదయం రాగి జావ, మధ్యాహ్నం జగనన్న గోరుముద్ద పంపిణీ చేశారు. అదే విధంగా 93 శాతం మందికి కోడిగుడ్లు, 78 శాతం మంది చిక్కీలు తీసుకున్నట్లు తెలిసింది. తొలిరోజు ప్రభుత్వ పాఠశాలల్లో 63.46 శాతం మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. మొత్తంగా 10,593 మంది పనిచేస్తున్నారు. అయితే వారిలో 7,358 మంది పాఠశాలలకు వచ్చారు. ఆదివారం ఉపాధ్యాయుల బదిలీలు షెడ్యూల్ ముగిసింది. జిల్లాలో మొత్తం మూడువేల మందికి పైగా ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, హెడ్‌మాస్టర్లు బదిలీ అయ్యారు. ఇంకా కొందరు పాఠశాలల్లో రిపోర్టు చేయలేదు. దీంతోనే హాజరుశాతం తక్కువగా నమోదైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.



కేఎన్నార్ స్కూల్లో సీట్లు లేవని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



జెడ్పీ బాలికల పాఠశాలలో విద్యా కానుక అందజేస్తున్న హెచ్‌ఎం

'జగనన్నకు చెబుదాం'పై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(దర్గామిట్ట): 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.' అని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో ప్రజల నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్వో వెంకటరమణమ్మ సోమవారం అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలు మళ్లీ రీ ఓపెన్ కాకుండా సరైన పరిష్కారం చూపించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీపీఓ సుస్మితారెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

- ఉపాధి హామీ పథకంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలంటూ ఉద్యోగ సంఘాల నాయకులు ఏపీడీ శంకరనారాయణ, మృదుల, సిబ్బంది మధు, వంశీ, సునీల్, భానుప్రకాష్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

గుడ్లూరు: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని తెట్టు - రావూరు మధ్య ఆదివారం రాత్రి జరగ్గా సోమవారం రైల్వే పోలీసులు గుర్తించారు. వారి కథనం మేరకు.. మండలంలోని పూరేటిపల్లి గ్రామానికి చెందిన ఒంగోలు మల్‌తేజ (21) ఆదివారం రాత్రి తెట్టు - రావూరు మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రైల్వే వైద్యశాలకు తరలించారు. తండ్రి మాల్యాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. చేతికంది వచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో కోటంరెడ్డి రాద్ధాంతం

- అన్నదమ్ములపై హత్యాయత్నం
- నిందితుడిని తనతో పంపాలని టీడీపీ నాయకుడి హల్‌చల్

నెల్లూరు(క్రైమ్): అన్నదమ్ములపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని వెంటనే తనతో పంపాలని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆదివారం అర్ధరాత్రి నెల్లూరు సంతపేట పోలీస్‌స్టేషన్‌లో రాద్ధాంతం చేశారు. పోలీసుల కథనం మేరకు.. గాంధీ గిరిజన కాలనీకి చెందిన దేవరకొండ వెంకట్, అతడి అన్న సుసేంద్ర, అదే ప్రాంతానికి చెందిన హరికృష్ణ మరికొందరు ప్రభుత్వ ఐటీఐ వద్ద ఆదివారం క్రికెట్ ఆడుతుండగా సుసేంద్ర, హరికృష్ణ మధ్య వివాదం జరిగింది. కొద్దిసేపటికి సద్దుమణగడంతో అందరూ ఇళ్లకు వెళ్లిపోయారు. హరికృష్ణ అదేరోజు సాయంత్రం సుసేంద్రకు ఫోన్ చేసి తిట్టాడు. కొద్దిసేపటి తర్వాత గొడవను సర్దుబాటు చేసుకుందామని సుసేంద్రకు ఫోన్ చేశాడు. దీంతో అతను తన సోదరుడు వెంకట్‌తో కలిసి ఐటీఐ కళాశాల వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడ హరికృష్ణ, అతని బంధువులైన చంద్రమౌళి, స్నేహితుడు నవీన్, రవీంద్ర తదితరులున్నారు. ఉదయం జరిగిన గొడవను మనసులో పెట్టుకుని వారు ఇనుపరాడ్‌లు, కర్రలతో వెంకట్, సుసేంద్రపై దాడి చేశారు. సుసేంద్ర కేకలు వేస్తూ పరుగులు తీయగా బ్రిడ్జి వద్ద నున్న కిశోర్, సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపై సైతం దాడి జరిగింది. ఇంతలో గ్రామస్తులు రావడంతో నిందితులు పరారయ్యారు. గాయపడిన వెంకట్, సుసేంద్రను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. బాధితులు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు రాత్రి కేసు నమోదు చేశారు. నిందితుల్లో కొందరిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారు టీడీపీకి చెందిన వారు కావడంతో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వెంటనే స్టేషన్ వద్దకు చేరుకున్నారు. టీడీపీ నేత అయిన నవీన్‌ను అక్రమంగా ఇరికించారని, వెంటనే తనతో పంపాలని లేకపోతే స్టేషన్‌లోనే పడుకుంటానని నానా రాద్ధాంతం చేశారు. స్థానిక పోలీస్ అధికారులతోపాటు నగర డీఎస్పీపై ఒత్తిడి తెచ్చాడు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పడంతో కొద్దిసేపు హడావుడి చేసి వెళ్లిపోయారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): 'సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అనధికార చిట్స్ వేయరాదని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ప్రజలకు సూచించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 104 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన చట్టపరిధిలో నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనామత్తుగా అకౌంట్‌లో కొంత నగదు జమచేసి లింక్ ద్వారా తిరిగి పంపాలని లేకపోతే అసభ్యకర దృశ్యాలు సోషల్ మీడియాలో షేర్ చేస్తామని సైబర్ నేరగాళ్లు బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే స్థానిక పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం స్పందన ఫిర్యాదుదారులకు భోజనం, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, దిశ, ఏఆర్, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీలు సురేష్ బాబు, గాంధీ, శ్రీనివాసరావు, ఆర్‌ఐ అంకమరావు తదితరులు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

లైంగికదాడి కేసులో నిందితుడికి రిమాండ్

ఇందుకూరుపేట: గిరిజన మహిళపై లైంగికదాడికి పాల్పడిన కేసులో పాస్టర్ ఐజయ్యకు కోర్టు రిమాండు విధించినట్లు ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. ముదివర్తిపాళెంకి చెందిన గిరిజన మహిళపై అదే ప్రాంతంలో పాస్టర్‌గా పనిచేస్తున్న ఐజయ్య లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచడంతో రిమాండు విధించినట్లు ఎస్సై వెల్లడించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం: పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుమన్ (23) అనే యువకుడు సోమవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై వీర ప్రతాప్ కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని కాశీపాళెంకి చెందిన సుమన్ గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పటి నుంచి మతి స్థిమితంగా లేదు. మద్యానికి బానిసయ్యాడు. అతను ఈ నెల 9వ తేదీ పురుగు మందు తాగాడు. కుటుంబసభ్యులు ఆలస్యంగా గుర్తించి అతడిని తిరుపతిలోని రుయా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందగా పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లాలో నేటి నుంచి లోకేశ్ పాదయాత్ర

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం సాయంత్రం జిల్లాకు చేరుకుంటుందని, మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి నుంచి యాత్ర ప్రారంభం అవుతుందని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. పాదయాత్ర సాగే ప్రాంతాలను టీడీపీ నాయకులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పడమటినాయుడుపల్లి వద్ద రాత్రి బస చేస్తారని తెలియజేశారు.

పొగాకు కేజీ రూ.241

కందుకూరు: పొగాకు వేలంలో ధరల జోరు కొనసాగుతూనే ఉంది. రైతులు ఊహించని విధంగా ఈసారి రేట్లు పెరుగుతున్నాయి. సోమవారం జరిగిన వేలంలోనే కేజీ పొగాకు ధర అత్యధికంగా రూ.241 పలికింది. కందుకూరు ఒకటో వేలం కేంద్రంలో 783 బేళ్లను విక్రయానికి ఉంచగా 693, కందుకూరు-2లో 924 గానూ 833 బేళ్ల కొనుగోలు చేశారు. రెండు కేంద్రాల్లో గరిష్ఠంగా రూ.241, కనిష్ఠంగా రూ.160, సరాసరి ధర రూ.229 నమోదైంది.

15న వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో బాలాజీ జాబ్ ప్లేస్‌మెంట్స్ సౌజన్యంతో ఈనెల 15వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	రూ.38
సన్నవి	రూ.25
పండ్లు	రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	172
లేయర్ (లైవ్)	105
బ్రాయిలర్ చికెన్	290
బ్రాయిలర్ స్కిన్‌లెస్	320
లేయర్ చికెన్	178

